సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
మంగళవారం, 08.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 309
పేజీలు: 08 వెల: రూ. 5

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను
# అడ్డుకోవడానికి వీల్లేదు
**పోలీసులకు తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు**

- హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై సీరియస్..
- బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ కు ఆదేశాలు

02



## గ్యాస్ బుకింగ్‌పై కీలక నిర్ణయం
**గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్** 02

- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన
- వెంటనే అమల్లోకి
- 45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు
- ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు



## ఆర్టీసీ విలీనం.. ఇప్పట్లో లేనట్లే
**ఇంకా కార్యాచరణలోకి రాని అంశం** 02

- 'ఇందిరమ్మ' ఇండ్ల కోసం ఆర్టీసీ స్థలాలు
- మండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్





## ఇన్వెస్ట్ తెలంగాణ
**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సన్నాహకాలపై సీఎస్ సమీక్ష**

- ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులకు ఆహ్వానాలు పంపాలి: సీఎస్ సంజయ్ జాజు

02

## అసెంబ్లీలో

- స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలతో గందరగోళం
- తాతా మధును డిస్మిస్ చేయాలన్న రేవంత్
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలన్న సీఎం

# రగడ!
## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

- స్పీకర్ కంటతడితో అసెంబ్లీలో ఉద్విగ్నం
- తాతా మధు వ్యాఖ్యలపై రేవంత్ ఫైర్
- తెలంగాణ అసెంబ్లీలో తొలిరోజే తీవ్ర రచ్చ
- స్పీకర్ కు అవమానంపై సభలో దుమారం
- '22-ఏ' భూములపై బీజేపీ ఆందోళన
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య హైడ్రామా



**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ శాసనసభ సమావేశాల తొలిరోజే సభలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల ఆందోళనలు, పరస్పర ఆరోపణలతో సభ రసాభాసగా మారింది. ముఖ్యంగా శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు సభను కుదిపేశాయి. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. తాతా మధును డిస్మిస్ చేయాలని, ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**'తెలంగాణకు చీకటి రోజు'**

స్పీకర్‌కు జరిగిన అవమానం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. స్పీకర్‌పై జుగుప్సాకరమైన భాషను ఉపయోగించడం దారుణమన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ ముందుగానే పిలిపించి, స్పీకర్‌పైకి ఉసిగొల్పారని ఆరోపించారు. ఇది అనుకోకుండా జరిగిన ఘటన కాదని, పథకం ప్రకారమే జరిగిందని విమర్శించారు. 'సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానం. ఇలాంటి ఘటన స్వతంత్ర భారత చరిత్రలో గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇలాంటి భాషను ఉపయోగించిన తాతా మధును డిస్మిస్ చేయాలి. ఆయనతో రాజీనామా చేయించాలి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ క్షమాపణ చెప్పాలి' అని రేవంత్ డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్‌పై రేవంత్ తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. దళితులను మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక ఆలోచన అని అన్నారు. స్పీకర్‌కు జరిగిన అవమానాన్ని అందరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఈ అంశంపై చర్చ పూర్తయ్యే వరకు ఇతర అంశాలను చర్చించకూడదని ప్రభుత్వం తరపున రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతల ఆరోపణలను బీజేపీ నేతలు ఎందుకు మోస్తున్నారని ప్రశ్నిస్తూ.. ఈ అంశంపై చర్చకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు.

**కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్‌కుమార్**

స్పీకర్‌పై వ్యాఖ్యల అంశం సభలో చర్చకు వచ్చిన సమయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను ఖండిస్తూ మంత్రి సీతక్క సభలో మాట్లాడారు. స్పీకర్ తల్లిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఈ సమయంలో ప్రసాద్ కుమార్ కంటతడి పెట్టుకున్నారు. స్పీకర్ భావోద్వేగానికి గురికావడంతో సభలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సభాపతి స్థానానికి గౌరవం ఇవ్వాలని అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. మిగతా 02లో

### ఈ కన్నీళ్లే నిన్ను
# తుడిచిపెట్టేది
## సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం



- దుర్యోధన, దుశ్శాసనుల పాలన
- మహిళా ఎమ్మెల్యేపై దురుసు వ్యవహారం.. కేటీఆర్ ఆగ్రహం
- రేవంత్.. గుర్తుంచుకో అంటూ కేటీఆర్ తీవ్ర హెచ్చరిక

02

# ఉద్రిక్తత
**అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఆందోళన**



- కేటీఆర్‌ను ఎత్తుకెళ్లిన పోలీసులు
- టీషర్ట్ విప్పేసిన హరీశ్ రావు.. తీవ్ర నిరసన
- చీర లాగారని కన్నీరు పెట్టుకున్న సునీత
- పోలీసులతో తోపులాట.. జగదీశ్ రెడ్డికి గాయం
- అసెంబ్లీ తొలిరోజే కాంగ్రెస్-బీఆర్ఎస్ వార్

02



### ప్రతి ఎకరాకూ నీటితో తెలుగుతల్లికి
# జలహారతి
**వాటర్ మెన్‌గా ఎకనామిక్ టైమ్స్ పేర్కొనటం సంతోషం**
**టీడీపీ లీడర్షిప్ కాన్ క్లేవ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

- సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణపై పనిచేయటమే సంతృప్తి
- పొలిటికల్ గవర్నెన్సుకు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు

03




### తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు
# పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు క్లెయిమ్ లు, అభ్యంతరాలు
- నవంబర్ 5 లోపు దరఖాస్తుల పరిశీలన
- అదే నెల 9న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

*తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి సవరించింది. ఓటర్ల నమోదు, క్లెయిమ్‌లు అలాగే అభ్యంతరాల స్వీకరణకు సంబంధించిన గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఇవాళ సాయంత్రం అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే, సవరించిన షెడ్యూల్ ప్రకారం.. క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించారు.*

-ముద్ర హైదరాబాద్ :

### పోరాటం కమ్యూనిస్టులది..
**కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
# పరిష్కారం కాంగ్రెస్‌ది

- కమ్యూనిస్టుల పోరాటాలంటే నాకు అభిమానం
- దున్నే వాడికే భూమి ఇచ్చింది కాంగ్రెస్
- 2029లో మోదీ ఓటమికి ఇవే తొలి అడుగులు
- ఎర్రజెండా అంటే పేదలకు భరోసా

02




## కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారు
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి** 03



# దారెటు?
## కాంగ్రెస్‌లో ఉంటాం: కొండా దంపతులు

- బీఆర్ఎస్‌లోకి ఆహ్వానం లేదు..
- బీజేపీలో ఇమడటం కష్టమే!
- వరంగల్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ..
- సొంత క్యాడర్‌తోనే ముందుకు?

02

**ముద్ర డెస్క్ :**
మాజీ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి రాజకీయ భవిష్యత్తుపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో.. ఇక కొండా దంపతుల రాజకీయ ప్రయాణం ఎటువైపు అన్న ప్రశ్న ఆసక్తికరంగా మారింది. తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని వారు స్పష్టం చేస్తున్నప్పటికీ.. అధిష్ఠానంతో విభేదాలు, స్థానికంగా నెలకొన్న రాజకీయ పరిణామాలు వారికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి.

**కాంగ్రెస్‌లోనే ఉంటారా?**

కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని కొండా దంపతులు చెబుతున్నా.. ప్రస్తుత పరిస్థితుల్లో సొంత పార్టీలోనే వారికి ప్రతికూల వాతావరణం కనిపిస్తోందన్న

మిగతా 02లో

**ఇదీ AI ముద్ర**



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 08.09.2026
www.mudranews.in | @mudranews



## వైరల్ జ్వరాలు : నీరు ఎక్కువగా తాగాలి



జ్వరం, చెమట కారణంగా శరీరంలో నీరు తగ్గే అవకాశం ఉంటుంది. డీహైడ్రేషన్ రాకుండా నీరు, కొబ్బరి నీరు, సూప్‌లు, ఇతర ద్రవాలను తరచూ తీసుకోవడం మంచిది.

# అసెంబ్లీలో రగడ!

(మొదటి పేజీ తరువాయి)

**'22-ఏ' భూములపై బీజేపీ ఆందోళన**

మరోవైపు '22-ఏ' భూముల అంశం కూడా సభలో వేడి పెంచింది. ఈ అంశంపై బీజేపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడంతో బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో కమలం పార్టీ ఎమ్మెల్యేలు సభలో ఆందోళన చేపట్టారు. '22-ఏ' భూముల వ్యవహారంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో '22-ఏ' భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆడిట్ నివేదిక ఎక్కడివరకు వచ్చిందో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**తొలిరోజే తారస్థాయికి రాజకీయ వేడి**

ఒకవైపు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారం, మరోవైపు '22-ఏ' భూముల అంశంపై బీజేపీ ఆందోళనతో తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే రాజకీయ వేడి తారస్థాయికి చేరింది. స్పీకర్ గౌరవం, తాతా మధు వ్యాఖ్యలపై చర్యలు, కేసీఆర్ క్షమాపణ డిమాండ్‌తో కాంగ్రెస్ పట్టుబడుతుండగా.. '22-ఏ' భూములపై తక్షణ చర్చకు బీజేపీ డిమాండ్ చేస్తోంది. దీంతో సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం జరుగుతుంది.

# అసెంబ్లీ వద్ద తీవ్ర ఉద్రిక్తత

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధంతో పాటు అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడంతో పోలీసులు వారిని అడ్డుకోవడం వివాదానికి దారితీసింది. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి కొద్దిసేపు ఉద్రిక్తంగా మారింది.

ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చారు. అయితే స్లోగన్స్‌తో ఉన్న టీషర్టులను ధరించి అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లేందుకు పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపుతప్పకుండా పోలీసులు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అదుపులోకి తీసుకున్నారు.



మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో కూడా హైడ్రామా నెలకొంది. కేటీఆర్‌ను ఎత్తుకొని కారులోకి దింపే సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.. కేటీఆర్‌ను పోలీసు వాహనంలోకి ఎక్కించే సమయంలో పోలీసులు దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. దీనిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పట్ల ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డ ఆయన.. రేవంత్ రెడ్డికి ఇంతకు ఇంతా చెల్లిస్తామని హెచ్చరించారు.

ఇదే సమయంలో మరోవైపు మాజీ మంత్రి హరీశ్ రావు కూడా పోలీసుల తీరుకు నిరసనగా తన టీషర్ట్ విప్పేశారు. కేపీ వివేక్, సుధీర్ రెడ్డి కూడా టీషర్టులు విప్పినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితోనూ పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. తన చీరను పోలీసులు లాగారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ప్రజాప్రతినిధి పట్ల ఇలా వ్యవహరించడం ఏమిటని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో ఆమె తీవ్ర భావోద్వేగానికి గురికాగా, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆమెను ఓదార్చారు.

ఇక పోలీసులతో జరిగిన తోపులాటలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కాలికి గాయమైనట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. అసెంబ్లీ ప్రారంభానికి ముందే చోటుచేసుకున్న ఈ పరిణామాలతో అసెంబ్లీ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మరోవైపు అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించిన ఆయన.. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని స్పష్టం చేశారు. దీంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. రానున్న రోజుల్లో ఈ వివాదం మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఆర్టీసీ విలీనం.. లేనట్లే

**ముద్ర , హైదరాబాద్ :**
ఆర్టీసీ విలీనంపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అనేది ఇంకా కార్యాచరణలోకి రాలేదన్నారు. గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు జరిపిన తర్వాతే కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. ఇవాళ శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన మంత్రి.. ఆర్టీసీతో ప్రభుత్వం చర్చల్లో గుర్తింపు పొందిన కార్మిక సంఘం కోసం ఎన్నికలు నిర్వహించడం, ప్రభుత్వంలో విలీనం చేసి 11 శాతం ఫిట్ మెంట్ ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కార్మిక శాఖ ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందన్నారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఆర్టీసీ జేఏసీతో జరిగిన చర్చల అంశాల నుంచి ప్రభుత్వం ఎక్కడా పక్కకు వెళ్లడం లేదని ఆర్టీసీ విషయంలో చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో జరిగిన విలీనంతో అనేక సమస్యలు వచ్చాయని అలాంటి ఇబ్బందులు ఇక్కడ ఉండొద్దనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. నాకు కూడా చాలా బాధగా ఉంది. కానీ ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు తెలియనిది కాదు. 2017 2024 వరకు 13 వేల మంది రిటైర్డ్ అయ్యారు. వారికి రూ. 1152 కోట్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వం రాష్ట్రంపై ఎలా అప్పుల భారం మోపిందో ఆర్టీసీ సంస్థపై కూడా అలాగే అప్పుల్లో ముంచిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి, సంస్థకు పూర్తి కన్సర్న్ ఉందన్నారు. ఆర్థిక వెసులుబాటును బట్టి చెల్లింపులు చేస్తున్నామన్నారు. మేము అధికారంలోకి వచ్చాక అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. ఆర్టీసీ కార్మికుడు మరణిస్తే రూ.కోటి ఇచ్చేలా ఇన్సూరెన్స్ ఇస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వానికి ఆర్టీసీ స్థలాలు ఇచ్చామని అవసరం అయితే ఇంకా కూడా ఇస్తాం అన్నారు. గతంలో ఆర్టీసీ కోసం ప్రభుత్వం తమకు స్థలాలు కేటాయించిందని ఇప్పుడు అవసరం మేరకు ఆర్టీసీ ఇస్తోందని ఇది ప్రభుత్వంతో ఆర్టీసీకి ఉన్న సమన్వయం అన్నారు. పేదల ఇళ్ల కోసం స్థలాలు ఇస్తే నేరం చేసినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రయాణికులకు సేవలు, కార్మికుల సంక్షేమం విషయంలో మా ప్రయత్నం కొనసాగుతోందని దీన్ని ప్రశంసించకపోయినా పర్వాలేదు కానీ విమర్శించి ఆర్టీసీ కార్మికుల నైతికతను దెబ్బతీయవద్దన్నారు. ఆర్టీసీ విలీనం మా బాధ్యత అని అంతే తప్ప దాన్ని ఇవాళ, రేపే చేయాలనడం సరికాదన్నారు.




# ఈ కన్నీళ్లే నిన్ను తుడిచిపెట్టేది



**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజు చోటుచేసుకున్న ఉద్రిక్తతలతో స్టేట్ పాలిటిక్స్ ఒక్కసారిగా హీటెక్కాయి. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను నిరసిస్తూ నల్ల దుస్తులతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**దుర్యోధన, దుశ్శాసనుల పాలన..**

రాష్ట్రంలో సీఎం, మంత్రులు దుర్యోధనుడు, దుశ్శాసనుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళా ఎమ్మెల్యేల బట్టలు విప్పేసే ఘటనలే జరుగుతున్నాయని, ఇందిరమ్మ రాజ్యంలో అసలు మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధి అయిన సునీతా లక్ష్మారెడ్డి పై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ఇదే అన్యాయం సోనియా గాంధీకి, ప్రియాంకా గాంధీకి జరిగితే రాహుల్ గాంధీ ఊరుకుంటారా అని కేటీఆర్ సూటిగా నిలదీశారు. మహిళా నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా పరిగణించాలని, బాధ్యులైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ హెచ్చరించింది. 'గుర్తుంచుకో రేవంత్ రెడ్డి.. ఈ మహిళల కన్నీళ్లు నిన్ను వెంటాడి త్వరలోనే సర్వనాశనం చేస్తాయి' అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను
# అడ్డుకోవడానికి వీల్లేదు

**ముద్ర, హైదరాబాద్ :**
శాసనసభ సమావేశాల ప్రారంభం రోజే అసెంబ్లీ గేట్ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, పోలీసుల తీరుపై రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం చెలరేగిన వేళ తెలంగాణ హైకోర్టు జోక్యం చేసుకుంది. పోలీసుల తీరును సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అత్యవసరంగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ప్రభుత్వానికి, పోలీసు శాఖకు స్పష్టమైన కీలక ఆదేశాలు జారీ చేసింది. సభకు శాసనసభ, మండలి సభకు హాజరయ్యే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసులు అడ్డుకోవడానికి వీల్లేదని కోర్టు తేల్చిచెప్పింది. ప్రజాప్రతినిధులు విధులకు హాజరవుతున్న సమయంలో పోలీసుల జోక్యం సరికాదని పేర్కొన్నది. ఒకవేళ సభ్యులు సభలో, నిబంధనలు ఏమైనా ఉల్లంఘిస్తే, వారిపై చర్యలు తీసుకునే పూర్తి అధికారం కేవలం స్పీకర్‌కు మాత్రమే ఉంటుందని, పోలీసులే స్వయంగా శాసనసభ్యులపై చర్యలు తీసుకోవడానికి ఎలాంటి చట్టపరమైన అధికారం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై సీరియస్..**

ఈ నిరసనల సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారన్న ఆరోపణలను హైకోర్టు అత్యంత తీవ్రంగా పరిగణించింది. మహిళా ప్రజాప్రతినిధులపై దాడి, దురుసు ప్రవర్తనకు పాల్పడిన పోలీసు సిబ్బందిని వెంటనే గుర్తించాలని ఆదేశించింది. బాధ్యులైన ఆ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ తరపు న్యాయవాదికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఇరువైపుల వాదనలను విన్న అనంతరం, ఈ కేసు విచారణను 2 వారాలకు న్యాయస్థానం వాయిదా వేసింది.

# పోరాటం కమ్యూనిస్టులది.. పరిష్కారం కాంగ్రెస్‌ది

**ముద్ర, హైదరాబాద్ :**
నేడు రవీంద్రభారతిలో జరిగిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టుల పోరాటాలపై తనకు అభిమానం ఉందని తెలిపారు. రైతు, కూలీల కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని, ఆ సమస్యలకు పరిష్కారం చూపింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఇంకా.. దున్నే వాడికి భూమి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని సీఎం పేర్కొన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. 'పోరాటం కమ్యూనిస్టులది.. పరిష్కారం కాంగ్రెస్ పార్టీది' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

మరోవైపు బీజేపీపై విమర్శలు చేస్తూ.. ప్రజలతో గెలవలేనప్పుడు సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించిందని ఆరోపించారు. ఇప్పుడు ఎస్ఐఆర్ (SIR)ను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. తమకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మైనార్టీల ఓట్లే కాకుండా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఎస్సీ, ఎస్టీల ఓట్లను కూడా తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓట్ల తొలగింపును అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతిపక్షాలు ఇప్పటివరకు ఈ అంశంపై మాట్లాడటం లేదని అన్నారు.

2029 ఎన్నికల్లో మోదీ ఓటమికి ఇవే తొలి అడుగులు అని సీఎం వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో అని ఆలోచించవద్దని.. 2026లోనే ఎవరు గెలవాలి.? ఎవరు ఓడిపోవాలి.? అనే విషయాన్ని బీజేపీ నిర్ణయించే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల సంఘం నిర్ణయించాల్సిన అంశాల్లో కూడా జోక్యం చేసుకునే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వందేళ్ల కమ్యూనిస్టు చరిత్రను తిరగేస్తే ఎర్రజెండా అంటే ప్రజలకు నమ్మకం, పేదలకు భరోసా అని రేవంత్ రెడ్డి అన్నారు. మిగిలిన జెండాలను ప్రజలు పాలకుల జెండాలుగా భావిస్తారని, ఎర్రజెండా కనిపిస్తే మాత్రం భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.

కమ్యూనిస్టులు ఎన్నికల్లో గెలుస్తారా? ఓడిపోతారా? అనే లెక్కలు వేసుకోవాల్సిన అవసరం లేదని సీఎం అన్నారు. ప్రజల ఓట్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కమ్యూనిస్టులు లేవనెత్తే సమస్యలకు సహేతుకమైన పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి అని ప్రస్తావించిన సీఎం.. సమస్యను లేవనెత్తేవారు పాలమూరు వారేనని, పరిష్కారం చేసేవారు కూడా పాలమూరు వారే అన్నారు. సారంపల్లి మల్లారెడ్డి పేరుకు తగిన గౌరవం దక్కేలా ఏదో ఒక ప్రాంతానికి ఆయన పేరు పెట్టే అంశంపై మంత్రివర్గంలో చర్చిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు.

# గ్యాస్ బుకింగ్‌పై నిర్ణయం

**ముద్ర ఢిల్లీ :**
వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు.

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

# ఇన్వెస్ట్ తెలంగాణ

**ముద్ర, హైదరాబాద్:**
రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ – తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఎక్స్‌ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.

సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ-మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆహ్వానితుల జాబితాను సిద్ధం చేసి, ఆహ్వానాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు.

తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ, ఐటీ, ఏఐ, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ ద్వారా ప్రపంచ పెట్టుబడిదారులకు సమర్థవంతంగా ప్రదర్శించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో సమయపాలనతో కూడిన కార్యాచరణను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణ ఆదిత్య, అజిత్ రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'కొండా' దంపతులకు దారేది?

(మొదటి పేజీ తరువాయి)

చర్చ సాగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, పార్టీ శ్రేణులతో వారి సంబంధాలపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అధిష్ఠానంతో ఏర్పడిన విభేదాలు మరింత ముదిరితే పార్టీలో రాజకీయ ప్రాధాన్యం తగ్గే అవకాశముందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

**గులాబీ గూటికి నో ఛాన్స్!**

కాంగ్రెస్ తర్వాత ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ వైపు వెళ్లే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది. అయితే ఈ మార్గం అంత సులభం కాదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌ను వీడే సమయంలో కొండా దంపతులు కేసీఆర్, కేటీఆర్, వారి కుటుంబం పై చేసిన తీవ్ర వ్యాఖ్యలు ఇప్పటికీ రాజకీయంగా ప్రస్తావనకు వస్తున్నాయి. ఆ నేపథ్యంలో గులాబీ పార్టీ నాయకత్వం వారిని తిరిగి ఆహ్వానించే పరిస్థితి లేదనే ప్రచారం జరుగుతోంది.

**కమలం గూటిలో ఇమడగలరా?**

కాంగ్రెస్, బీఆర్ఎస్ తర్వాత సహజంగానే బీజేపీ పేరు తెరపైకి వస్తోంది. అయితే కమలం పార్టీలో కొండా దంపతుల రాజకీయ శైలి ఎంతవరకు కలిసొస్తుందన్నది మరో ప్రశ్న. బీజేపీలో పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్ణయాలు, కేడర్ వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. వరంగల్‌లో ఇప్పటికే బలమైన స్థానిక నాయకత్వం ఉన్న నేపథ్యంలో కొత్తగా వచ్చే నాయకులకు ఎంత మేరకు రాజకీయ స్థలం లభిస్తుందనేది కీలకం. ముఖ్యంగా కొండా సురేఖకు ఉన్న స్వతంత్ర రాజకీయ శైలి, వరంగల్ ప్రాంతంలో ఉన్న వ్యక్తిగత రాజకీయ ప్రభావం.. బీజేపీ సంస్థాగత వ్యవస్థతో ఎలా కలుస్తాయన్నది చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో బీజేపీలోని కొందరు సీనియర్ నేతల వ్యాఖ్యలు, సోషల్ మీడియా పోస్టులు కూడా ఈ చర్చకు మరింత ఊతమిస్తున్నాయి.

**సొంత బలమే నమ్ముకోవాలా?**

మూడు ప్రధాన రాజకీయ మార్గాల్లోనూ ఇబ్బందులు ఎదురైతే.. కొండా దంపతులకు మిగిలేది సొంత రాజకీయ బలాన్ని నమ్ముకోవడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ తూర్పు, పరకాల నియోజకవర్గాల్లో తమకు ఉన్న వ్యక్తిగత పరిచయాలు, అనుచరులు, అభిమానులు, స్థానిక రాజకీయ ప్రభావాన్ని ఆధారంగా చేసుకుని ముందుకు వెళ్లే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతానికి ఏదైనా కొత్త రాజకీయ సమీకరణం ఏర్పడే వరకు వేచి చూడటం లేదా సొంత క్యాడర్‌తో రాజకీయంగా చురుగ్గా కొనసాగడమే వారి ముందున్న ప్రత్యామ్నాయాలుగా కనిపిస్తున్నాయి. మారుతున్న తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో కొండా దంపతుల తదుపరి అడుగు ఏంటి? కాంగ్రెస్‌లో కొనసాగుతారా?.. బీఆర్ఎస్ తలుపులు తెరుచుకుంటాయా?.. బీజేపీతో కొత్త ప్రయాణం మొదలుపెడతారా?.. లేక సొంత బలంతోనే రాజకీయ పోరాటం కొనసాగిస్తారా? కొండా దంపతుల తదుపరి రాజకీయ అడుగు ఇప్పుడు ఆసక్తికర అంశంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 8.09.2026
www.mudranews.in | @mudranews



## వైరల్ జ్వరాలు : తేలికపాటి ఆహారం తీసుకోవాలి

జ్వరం సమయంలో జీర్ణం సులభంగా అయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, అన్నం, పప్పు వంటి పోషకాహారం తీసుకుంటూ, నూనె, మసాలా ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తగ్గించడం మంచిది.



## శాసనసభ సెంట్రల్ హాల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర, హైదరాబాద్:** శాసన సభ ప్రాంగణంలో నూతనంగా రూపుదిద్దుకున్న సెంట్రల్ హాల్‌ను సభా నాయకుడు, ముఖ్య మంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు గారి పేరుతో సెంట్రల్ హాల్‌గా నామకరణం చేసిన ఈ ప్రాంగణ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి గారితో పాటు శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో పాటు మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాజీ శాసనసభ స్పీకర్ శ్రీపాద రావు గారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి గారు గౌరవ సభ్యులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన గద్వాల్ విజయలక్ష్మి

**ముద్ర, హైదరాబాద్** : స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గా గద్వాల్ విజయలక్ష్మి సోమవారం ప్రజాభవన్ లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రజా భవన్ కు విచ్చేసిన గద్వాల్ విజయలక్ష్మికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య విజయలక్ష్మి ఫైల్ పై సంతకం చేశారు. అనంతరం సీఎం ప్రజావాణి హాల్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కే కేశవరావు, వి. హనుమంతరావు, డాక్టర్ రోహిన్ రెడ్డి, ప్లానింగ్ శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కే. విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ నేతల నివాళులు



**ముద్ర, హైదరాబాద్:** వర్షాకాల అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమర వీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ నల్ల టీషర్టులతో నిరసన చేపట్టారు. అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఆయుష్ ఎకో- సిస్టమ్ ను బలోపేతంపై

## హైదరాబాద్ లో నీతీ ఆయోగ్ జాతీయ స్థాయి వర్క్ షాప్

**ముద్ర, హైదరాబాద్ :** దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిట ప్రాంతాల్లో ఆయుష్ ఎకో – సిస్టమ్ ను బలోపేతం చేయడానికి హైదరాబాద్ లోని కన్హా శాంతి వనంలో నీతీ ఆయోగ్ ఈనెల 8 వ తేదీన జాతీయ స్థాయి వర్క్ షాప్ నిర్వహిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఆయుష్ శాఖ డైరెక్టర్ ఐషా మస్రత్ ఖానం వెల్లడించారు. ఈ జాతీయ వర్క్ షాప్ కు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ కార్యదర్శి రాజేష్ కోతేచ, రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు లు హాజరవుతారని ఒక ప్రకటనలో తెలియచేసారు.

## ఎంఎల్సీ తాత మధు సభ్యత్వం రద్దు చేయాలి

**- మంత్రి సీతక్క**

**ముద్ర, హైదరాబాద్:** మంత్రి సీతక్క ఎంఎల్సీ తాత మధుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ స్పీకర్‌ను దుర్భాషలాడినందుకు తాత మధును బీఆర్ఎస్ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని, శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభలో ప్రజా సమస్యలపై చర్చించకుండా బయట డ్రామాలు చేయడం సరికాదన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను సమాజం తీవ్రంగా ఖండించాలని, ఇలాంటి వ్యాఖ్యలను ప్రోత్సహిస్తున్న బీఆర్ఎస్ నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీతక్క అన్నారు.

## గవర్నర్‌ను కలిసిన లెఫ్టినెంట్ జనరల్, వైస్ ఛాన్సలర్ లు



**ముద్ర, హైదరాబాద్** : రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను పలువురు ప్రముఖులు సోమవారం లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇండియన్ ఆర్మీ దక్షిణ భారత ప్రాంతం జెనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ ఉల్హాస్ కిర్పేకర్ గవర్నర్ ను కలిశారు.సైనిక, రక్షణ అంశాలపై గవర్నర్‌తో చర్చించారు. ఏఎస్‌సీఐ ఛైర్మన్ కె. పద్మనాభయ్య , యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వీసీ ప్రొఫెసర్ జె. అనురాధ, కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి, ఉస్మానియా విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, సాలార్‌జంగ్ మ్యూజియం నూతన బోర్డు సభ్యులు ప్రొఫెసర్ వి. కిషన్‌రావు, డాక్టర్ పెరంబుదూర్ జైకిషన్, డాక్టర్ రాజిరెడ్డి సీలం తదితరులు గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలకు సంబంధించిన వివిధ అంశాలపై గవర్నర్‌తో వారు చర్చించారు.

## శంషాబాద్ పోలీసుల అదుపులో యూట్యూబర్ నందన

**ముద్ర, హైదరాబాద్**: యూట్యూబర్ నందన ను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లుక్ అవుట్ నోటీసులు జారీ కావడంతో నందనను పోలీసులు గుర్తించారు. అనంతరం ఏపీలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి భారీగా డబ్బు వసూలు చేసినట్లు నందన దంపతులపై ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కేసు నమోదు కావడంతో ఇబ్రహీంపట్నం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నందనపై ఉన్న కేసులు, లుక్ అవుట్ నోటీసుల ఆధారంగా తదుపరి చర్యలకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం..

**గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహిస్తాం..**
**ధర్మపురి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో పుష్కరాలకు అభివృద్ధి పనులు..**
**ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణం లో పాల్గొనడం అదృష్టం..**
**ఉపముఖ్యమంత్రి విక్రమార్క..**



**ముద్ర, ధర్మపురి:** రాష్ట్రంలోని పురాతన ఆలయాల సంరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి భూమిపూజ చేశారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని భట్టి తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు ప్రముఖ ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.

పుష్కరాల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించామని, ధర్మపురి నియోజకవర్గానికి ఇప్పటికే రూ.117 కోట్లు విడుదల కాగా మరో రూ.80 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

దీంతో నియోజక వర్గానికి పుష్కరాల నిధులు సుమారు రూ.200 కోట్లకు చేరాయని తెలిపారు.ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.22.16 కోట్లు, ధర్మపురి, కోటిలింగాలలో తొమ్మిది రోడ్ల నిర్మాణానికి రూ.58.55 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు



### లక్ష్మీ నరసింహ స్వామి దయతో ముందుకు..

**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దయతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి నియోజకవర్గాన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని మంత్రి తెలిపారు.

## సింగరేణి 'మారుపేర్ల' సమస్యకు మానవీయ పరిష్కారం

**ముద్ర, హైదరాబాద్:** సింగరేణి కాలరీస్‌లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 'మారుపేర్ల' సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనమండలిలో తెలిపారు. 1997 నుంచి కొనసాగుతున్న ఈ సమస్యపై ఇప్పటికే కమిటీని ఏర్పాటు చేశామని, కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సింగరేణిలో సుమారు 90 వేల మంది ఉద్యోగులు ఉండగా, మారుపేర్ల సమస్య ఎదుర్కొంటున్న వారు 128 మంది మాత్రమేనని తెలిపారు. నిబంధనలు, చట్టపరమైన చిక్కులను పరిశీలించి ఎవరి మీదా భారం పడకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని భట్టి పేర్కొన్నారు.

# గణేశ్ ఉత్సవాలకు సమగ్ర భద్రతా ప్రణాళిక



**ముద్ర, హైదరాబాద్** : గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 14న ప్రారంభమయ్యే ఉత్సవాలు 25న నిమజ్జనంతో ముగియనున్న నేపథ్యంలో సోమవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. గణేశ్ మండపాల వివరాలను ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్తు, అగ్నిమాపక, ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాలు, క్యూల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. నిమజ్జన మార్గాలు, రహదారులు, వంతెనలను ముందుగానే గుర్తించి వాటి సామర్థ్యాన్ని పరిశీలించాలని ఆదేశించారు. మండపాలను జియో ట్యాగింగ్ చేసి వివరాలను టీజీ-కాప్ ప్లాట్‌ఫాంలో నమోదు చేయాలని సూచించారు. ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీలతో సమావేశాలు నిర్వహించి సమస్యలను ముందుగానే పరిష్కరించడంతోపాటు సామాజిక మాధ్యమాలపై నిఘా పెంచాలని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. సమావేశంలో డీజీ టెక్నికల్ సర్వీసెస్ వి.వి. శ్రీనివాసరావు, ఐజీ ఇంటెలిజెన్స్ కార్తికేయ, ఐజీ మల్టిజోన్-1 చంద్రశేఖర్‌రెడ్డి, టీస్పార్క్ ఎస్పీ రూపేష్, ఏఐజీ రమణకుమార్, హైదరాబాద్ డీసీపీ అవినాష్‌కుమార్, డీసీపీ విక్రాంత్‌కుమార్ సింగ్‌తో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా

**- ఎమ్మెల్సీ తాతా మధు**



**ముద్ర, హైదరాబాద్:** శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అంటే తనకు గౌరవ ముందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. అనని మాటలను తనకు ఆపాదించడం సరికాదని చెప్పారు. "స్పీకర్ ను నేనేమీ అనలేదు. ఆయన్ను అన్నట్లు భావిస్తే నా వ్యాఖ్యలను ఉపసంహ రించు కుంటున్నా. నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా. నాపై దాడి చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. నాపై దాడి చేసిన వారిని మాత్రమే ఆవేశంతో అన్నాను'' అని తాతా మధు వివరణ ఇచ్చారు.

# కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారు

**- మంత్రి ఉత్తమ్**



**ముద్ర, హైదరాబాద్:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారని సెటైర్లు గుప్పించారు. కూలిపోయిన కాళేశ్వరం దగ్గరకు సిగ్గు లేకుండా ఎలా పోతారు.? అని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ మీడియా హాల్లో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. నీళ్ల సమస్యకు రెండే కారణాలు ఉన్నాయని తెలిపారు. కేసీఆర్, ఎల్‌నినో రెండు కారణాలతోనే నీళ్ల సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు.

**కేసీఆర్ ఇంట్లో పడుకుంటే బెటర్..**

నీళ్ల విషయంలో కేసీఆర్‌కి నాలెడ్జ్ లేదని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. కేసీఆర్ ఇంట్లో పడుకుంటే బెటర్ అని హితవు పలికారు. అసభ్య వ్యాఖ్యల విషయంలో కేసీఆర్‌దే తప్పు అని చెప్పారు. కేసీఆర్ అనుచితంగా మాట్లాడినప్పుడు హీరోలాగా ఫీల్ అయ్యారని వ్యంగ్యంగా మాట్లాడారు. కేసీఆర్ మాట్లాడిన భాషను ఆయనపై ఉపయోగిస్తే నానా యాగీ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్ తప్పులు చేశారని విమర్శించారు. ఇరిగేషన్ శాఖను నాశనం చేసింది కేసీఆరే అని విమర్శించారు. లక్ష కోట్ల రూపాయలు పెట్టి కాళేశ్వరం కట్టారని అన్నారు. ఈ ప్రాజెక్టు సరిగా కడితే ఈ సమస్య ఉండకపోయేది కదా అని నిలదీశారు. బీజేపీకి సరెండర్ అయితే తామేం చేస్తామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయడానికి అడ్డుకుంది ఎవరు? అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

# ప్రతి ఎకరాకూ నీటితో తెలుగుతల్లికి జలహారతి

**వాటర్ మెన్ గా ఎకనామిక్ టైమ్స్ పేర్కొనటం సంతోషం**
**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణపై పనిచేయటమే సంతృప్తి**
**పొలిటికల్ గవర్నెన్సుకు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు**
**కష్ట కాలంలో నిలబడిన కార్యకర్తకే పార్టీలో పూర్తి గౌరవం**
**ప్రజల ఓటే మనకు గీటు రాయి.. 2029లో మెరుగైన ఫలితాలు రావాలి**
**వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు.. ఫ్యాక్ట్ తో కౌంటర్ ఇవ్వండి**
**ఉగ్రవాదుల్లా హిట్ -రన్- హైడ్ విధానంతో గొడ్డలి పార్టీ రాజకీయం**
**టీడీపీ లీడర్షిప్ కాన్ క్లేవ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**
**సాగునీటి రంగంపై చేస్తున్న కృషికి సీఎంకు పార్టీ నేతల స్టాండింగ్ ఓవేషన్**

**ముద్ర, అమరావతి:** రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీరు అందిస్తామని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్నారు. జల సంరక్షణపై చేస్తున్న కృషికి 'వాటర్‌మ్యాన్'గా గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని తెలిపారు. టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ఆయన నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకమని, కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన వారికి పూర్తి గౌరవం ఇస్తున్నామని చంద్రబాబు చెప్పారు. 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా నేతలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని సూచించారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని, కృష్ణా జలాలను చూసి ప్రజల కళ్లల్లో ఆనంద భాష్పాలు వచ్చాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, చంద్రబాబును 'వాటర్‌మ్యాన్'గా అభివర్ణిస్తూ ఎకనామిక్ టైమ్స్ ప్రచురించిన కథనంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ కథనం గుర్తించిందని తెలిపారు.

వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసి ప్రజలకు మరింత సేవ చేయాలని దిశానిర్దేశం చేశారు.




# పిల్లో లేకుండా నిద్ర

## ఆరోగ్యానికి క్షేమం



నిద్ర అనేది ప్రతీ ఒక్కరికి ముఖ్యమైనది. ఎంత హాయిగా ఫుల్‌గా నిద్రపోతే అంత ఆరోగ్యంగా ఉంటారు. అయితే కొందరు కంఫర్ట్ కోసం తల కింద దిండు పెట్టుకుని నిద్రపోతే.. మరికొందరు దిండు పెట్టుకోరు. దిండు పెట్టుకుని నిద్రపోవడం కంటే లేకుండా నిద్రపోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కొందరికి దిండు లేకపోతే అసలు నిద్రపట్టదు. ఎందుకంటే తల అంతా నొప్పిలా అనిపిస్తుంది. కానీ దిండు లేకుండా మొదటి రోజు నొప్పిగా అనిపించినా.. ఆ తర్వాత అలవాటు అవుతారని నిపుణులు చెబుతున్నారు. మరి దిండు లేకుండా నిద్రపోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో ఈ స్టోరీలో చూద్దాం.

### వెన్నునొప్పి తగ్గుతుంది

దిండు లేకుండా నిద్రపోవడం వల్ల వెన్నెముక నొప్పి తగ్గుతుంది. దిండ్లు పెట్టుకుని నిద్రపోవడం వల్ల సరిగ్గా నిద్రపట్టదు. ఎందుకంటే దిండు ఎత్తుగా ఉండటం వల్ల కొందరికి కంఫర్ట్ ఉండదు. కాబట్టి దిండు లేకుండా హాయిగా నిద్రపోండి. దీని వల్ల ఎలాంటి వెన్నెముక నొప్పి లేకుండా హాయిగా నిద్రపడుతుంది.

### మెడ నొప్పి తగ్గుతుంది

దిండు లేకపోతే మెడ నొప్పి వంటివి ఉండవని చాలా మంది అనుకుంటారు. కానీ దిండుతో నిద్రపోవడం వల్లే మెడ నొప్పి వస్తుంది. దీనికి తోడు ఎత్తు దిండ్లు వల్ల మెడ నొప్పి పెరిగిపోతుంది. అలాగే నిద్ర సరిగ్గా పట్టనివ్వదు. కాబట్టి దిండు లేకుండా సరిగ్గా నిద్రపోండి. దీని వల్ల మెడ నొప్పి ఉండకుండా కండరాల ఒత్తిడి కూడా తగ్గుతుంది. అలాగే రక్త ప్రసరణ కూడా సరిగ్గా జరుగుతుంది.

### తలనొప్పి రావచ్చు

కొందరి అనుకోకుండా తలనొప్పి వస్తుంది. దిండు మీద పడుకోవడం వల్ల తలనొప్పి కూడా వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి దిండు లేకుండా పడుకోండి. మీకు తలనొప్పి తగ్గుతుంది. ఎందుకంటే దిండుల వల్ల తలకు ఆక్సిజన్ సరఫరా అంతగా అందదు. దీని వల్ల తలనొప్పి వస్తుంది.

### ఒత్తిడిని తగ్గిస్తుంది

దిండు వేసుకుని నిద్రపోతే రాత్రంతా నిద్ర లేకుండానే అనిపిస్తుంది. దీంతో ఒత్తిడి ఎక్కువగా పెరిగిపోతుంది. దీనివల్ల మానసికంగా కాస్త ఇబ్బంది పడతారు. కాబట్టి దిండు లేకుండా నిద్రపోతే హాయిగా ఉంటుంది. ఎలాంటి ఇబ్బంది కూడా రాదు.

### మొటిమలను నివారిస్తుంది

దిండుతో నిద్రపోతే మొటిమలు వస్తాయి. ఎందుకంటే తలకి రాసుకున్న నూనె అంతా కూడా దిండుకు అంటుంది. మీరు దాని మీద ముఖం పెట్టినప్పుడు ఆ నూనె మరకలు అంటుకుని మొటిమలు వస్తాయి. అలాగే దద్దర్లు, ఇన్ఫెక్షన్లు కూడా వస్తాయి. కాబట్టి దిండు లేకుండా నిద్రపోండి. లేకపోతే దిండు కవర్‌ను కనీసం వారానికి ఒకసారి అయినా శుభ్రం చేయండి. దీనివల్ల బ్యాక్టీరియా కాస్త క్లియర్ అవుతుంది.

### నిద్రపోయే భంగిమ బట్టి..

కొందరు పక్కకి, వెనుకకు, కడుపును కిందకి పెట్టి నిద్రపోతుంటారు. అయితే ఒక్కో భంగిమలో నిద్రపోయే వారికి తప్పకుండా దిండు ఉండాలి. వెనుకకు నిద్రపోయే వారికి దిండు అక్కర్లేదు. కానీ పక్కకి పడుకునేవారికి తప్పకుండా దిండు అవసరం. మిగతా భంగిమల కంటే పక్కకి పడుకుని నిద్రపోయే వారు అసలు దిండు లేకుండా నిద్రపోకూడదు.



## వేగంగా ఆహారం

# తీసుకోవొద్దు

కొందరు భోజనం ఆలస్యంగా చేస్తారు. మరికొందరు ఫాస్ట్‌గా తింటారు. ఏదైనా వర్క్ ఉండటం వల్ల ఫాస్ట్‌గా తింటారు. కానీ కొందరికి ఫాస్ట్‌గా తినడమే అలవాటు ఉంటుంది. ఇలాంటి వాళ్లకి అనారోగ్య సమస్యలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. ఎప్పుడో ఒకసారి ఫాస్ట్‌గా తింటే పర్లేదు. కానీ రోజూ కూడా తొందరగా తింటే మాత్రం తప్పకుండా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడతారని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా మన ఇంట్లో వాళ్లు ఆలస్యంగా తింటే.. తొందరగా తినమని చెబుతుంటారు. కానీ భోజన విషయంలో ఆలస్యమే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు అంటున్నారు. అసలు ఆలస్యంగా ఎందుకు భోజనం చేయకూడదు? చేస్తే ఏమవుతుంది? ఎలాంటి సమస్యల బారిన పడతారో మరి ఈ స్టోరీలో తెలుసుకుందాం.

స్కూల్, కాలేజీ, ఆఫీస్ ఇలా ఎక్కడికైనా వెళ్లాలని కొందరు తొందరగా భోజనం చేస్తారు. ఒక ముద్ద నమలకుండానే ఇంకో ముద్ద పెడతారు. దీనివల్ల జీర్ణ సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. తొందరగా తినడం వల్ల అజీర్తి, గ్యాస్, అధిక ఆమ్లత్వం వంటి సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫాస్ట్‌గా తినడం వల్ల ఎంత ఫుడ్ తిన్నారో కూడా సరిగ్గా తెలియదు. దీనివల్ల కొన్నిసార్లు ఎక్కువగా తింటారు. దీంతో బరువు పెరిగే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా ఫాస్ట్‌గా తినడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. దీంతో గుండె పోటు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫాస్ట్‌గా తిన్నప్పుడు ఒక్కోసారి గొంతులో ఆహారం ఇరుక్కుంటుంది. దీంతో శ్వాస సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తొందరగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.

వేగంగా తినడం వల్ల మానసికంగా ఎక్కువ ఒత్తిడిని అనుభవిస్తారు. వీటితో పాటు నిద్రలేమి, చర్మ సమస్యలు, జుట్టు రాలడం వంటివి కూడా వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆలస్యం కొన్నిసార్లు మంచిదే. అలాగే ఫుడ్ విషయంలో కూడా ఆలస్యమే మంచిదని నిపుణులు అంటున్నారు. ఆహారాన్ని నములుతూ ఫుడ్ తినడం వల్ల జీర్ణం అవుతుంది. దీనివల్ల ఎలాంటి జీర్ణ సమస్యలు కూడా రావు. అలాగే ఆహారంలోని పోషకాలు అన్ని శరీరానికి అందుతాయి. కాబట్టి కాస్త నెమ్మదిగా తినడం అలవాటు చేసుకోండి. అలా అని మరీ నెమ్మదిగా తినవద్దు. ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో చాలా మంది ఆలస్యంగా కంటే ఫాస్ట్‌గానే ఎక్కువగా తింటున్నారు. వర్క్ ఉందని లేకపోతే ఇంకా వేరే కారణాల వల్ల తొందరగా తినవద్దు. ఎంత బిజీ వర్క్ ఉన్నా కూడా తినడానికి కాస్త సమయమైన కేటాయించండి. అప్పుడే మీరు ఎలాంటి సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారు.



## కుంకుమ పువ్వు

# ప్రయోజనాలెన్నో

కుంకుమ పువ్వును ఎక్కువగా గర్భిణులు (Pregnancy) ఉపయోగిస్తుంటారు. దీని ఖరీదు చాలా ఉంటుందనే విషయం మనలో చాలా మందికి తెలిసిన విషయమే. దీన్ని బంగారంతో పోలుస్తారు. బంగారం ఎంత విలువైనదో కుంకుమ పువ్వు (Saffron) అంత కన్న విలువైనదిగా భావిస్తారు. ఇది ఒక సుగంధ ద్రవ్యం. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా గర్భిణులు (Pregnancy) ఉపయోగిస్తారు. పాలలో కలిపి తాగుతారు. ఇలా తాగడం వల్ల పిల్లలు తెల్లగా పుట్టడంతో పాటు గర్భిణుల ఆరోగ్యానికి మంచిదట. అయితే ఇది చాలా ఖరీదు ఉండటంతో కొందరు తక్కువగా తీసుకుంటారు. అసలు ఈ కుంకుమ పువ్వులో (Saffron) అంత ఎక్కువ పోషకాలు ఉన్నాయా? ఎందుకు ఇది అంత ఖరీదు? దీనికి గల కారణం ఏంటి? దీన్ని దేనికి చిహ్నంగా భావిస్తారో పూర్తి విషయాలు తెలుసుకుందాం.

కుంకుమ పువ్వును ఎక్కువగా శీతల ప్రదేశాల్లో పండిస్తారు. పువ్వులోని కేసరాలను తీసి ఎండబెట్టి కుంకుమ పువ్వును తయారు చేస్తారు. దీన్ని తయారు చేయడానికి చాలా సమయం పడుతుంది. ఒక కేజీ కేసరాలు కావాలంటే దాదాపు రెండు లక్షల పువ్వులు కావాలి. దీనికి చాలా శ్రమ ఉంటుంది. ఈ కారణం వల్లనే కుంకుమ పువ్వు చాలా ఖరీదు. కుంకుమ పువ్వులోని కేసరాలు రుచికి కాస్త చేదుగా ఉండటంతో పాటు తియ్యగా కూడా ఉంటాయి.

ఈ కుంకుమ పువ్వును సాగు చేయడం చాలా కష్టం. అలాగే వీటి విత్తనాలను 15 ఏళ్లకు ఒకసారి నాటాలి. కుంకుమ పువ్వు పంట ప్రతీ ఏడాది చేతికి వస్తుంది. ఈ పువ్వులను ఏడాదికి ఒకసారి వస్తుంది. కేవలం ఒక్క గ్రాము కుంకుమ పువ్వు పండించాలన్నా కూడా చాలా కష్టపడాలి. అందుకే ఈ కుంకుమ పువ్వు గ్రాముల కూడా చాలా ఖరీదు ఉంటాయి. కుంకుమ పువ్వును శక్తికి చిహ్నంగా భావిస్తారు. ఇతర రంగుల పువ్వుల కంటే కుంకుమ పువ్వు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ప్రేరేపిస్తుంది. అలాగే అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. దీని పువ్వులను సంతోషానికి కూడా చిహ్నంగా భావిస్తారు.

కుంకుమ పువ్వు తీసుకోవడం వల్ల చాలా అనారోగ్య సమస్యలు అన్ని కూడా క్లియర్ అవుతాయి. అలాగే రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఇందులోని పోషకాలు చర్మ సౌందర్యాన్ని పెంచడంలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇవి ఎక్కువగా శీతల ప్రాంతంలో పండిస్తారు. దక్షిణ భారత దేశంలో కంటే ఉత్తర భారతదేశంలో ఈ కుంకుమ పువ్వును పండిస్తారు. ఉత్తర భారత దేశంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల ఆ రాష్ట్రాల్లో ఎక్కువగా పండిస్తారు. మన దేశంలో జమ్మూకశ్మీర్‌లో కుంకుమ పువ్వును సాగు చేస్తుంటారు.

# ఈ కప్పుల్లో టీ, కాఫీ తాగుతున్నారా.. తస్మాత్ జాగ్రత్త

టీ, కాఫీ అంటే కొందరికి ప్రాణం. అసలు దీన్ని తాగకపోతే కొందరికి రోజూ కూడా గడవదు. సాధారణంగా ఎవరికైనా సూర్యోదయంతో డే స్టార్ట్ అయితే.. కొందరికి మాత్రం వీటితోనే స్టార్ట్ అవుతుంది. అసలు రోజులో ఎన్నిసార్లు తాగుతారో లెక్క కూడా ఉండదు. అయితే కొందరు ఇంట్లో టీ చేసుకుని తాగితే.. మరికొందరు బయట తాగుతుంటారు. ఇంట్లో చేసిన కాఫీ లేదా టీ తాగితే వారు స్పెషల్ గ్లాస్‌లో వేసుకుని తాగుతారు. అదే బయట అనుకో పేపర్ గ్లాసులు (Disposable Glass) ఉంటాయి. గాజు గ్లాసులు ఉంటాయి. కానీ ఎక్కడో ఒక దగ్గర ఉంటాయి. ఎందుకంటే వీటిని వాడిన తర్వాత క్లీన్ చేయాలి. దీని కంటే వాడి పడేసినవి బెటర్ అని చాలా మంది పేపర్ గ్లాసులు వాడుతుంటారు. అయితే ఈ పేపర్ గ్లాసుల్లో కాఫీ, టీ తాగితే అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందులోని రసాయనాలు అనారోగ్య సమస్యలను తెచ్చిపెడతాయి. అయితే డైలీ మీరు బయట ఇలాంటి ప్లాస్టిక్ గ్లాస్‌లో కాఫీ, టీ లేదా పాలు వంటివి తాగుతున్నారా.. ఇది మీ కోసమే.

ఏ సీజన్ అయినా కూడా చాలా మంది ఏదో ఒకటి బయట తాగుతుంటారు. కేవలం టీ, కాఫీ అనే కాకుండా జ్యూస్‌లు వంటివి కూడా డిస్పోజబుల్ పేపర్ కప్పుల్లో తాగుతారు. ఇవి పేపర్ అని వాడి పడేస్తే ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎలాంటి నష్టం ఉండదని భావిస్తారు. కానీ వీటి వల్ల ఆరోగ్యానికి చాలా నష్టాలు ఉన్నాయని గుర్తించరు. ఎందుకంటే కాగితపు కప్పులను తయారు చేయడానికి అనేక రకాల రసాయనాలు, ప్లాస్టిక్‌లను ఉపయోగిస్తారు. ఇవి మన ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. వీటిలో ఎక్కువగా మైక్రో ప్లాస్టిక్‌లు ఉపయోగిస్తారు. వీటిని వాడటం వల్ల అందులోని రసాయనాలు అనారోగ్యం బారిన పడేలా చేస్తాయి.

ఒక పేపర్ కప్పులో ఏదైనా వేడి పానీయం వేసి దాదాపుగా 15 నిమిషాల పాటు ఉంచితే తప్పకుండా అనారోగ్య సమస్యలు వస్తాయి. కేవలం ఈ 15 నిమిషాల్లోనే 20,000 నుంచి 25,000 మైక్రోప్లాస్టిక్ కణాలు ఉంటాయి.




ఇవి మన శరీరంలోకి ప్రవేశించి హార్మోన్ల అసమతుల్యత, ప్రమాదకరమైన క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు దారితీస్తుంది. కాబట్టి ప్లాస్టిక్ కప్‌లను ఎక్కువగా వాడవద్దు. వీటికి బదులు పింగాణీ లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ కప్పులను ఉపయోగించడం బెటర్. డైలీ కాఫీ తాగితే గాజు, స్టీల్ వంటివి ఉపయోగించాలని నిపుణులు చెబుతున్నారు. ఇందులోనివి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.



**వేరుశెనగ నూనె:** మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు (MUFA) ఎక్కువగా ఉంటాయి.

**సన్‌ఫ్లవర్ నూనె:** పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు (PUFA) అధికంగా ఉంటాయి.

**ఆవనూనె:** MUFA, PUFA రెండూ సమపాళ్లలో ఉంటాయి.

ఈ కొవ్వుల తేడాలు శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిల్ని, గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అయితే, అధిక వేడి వద్ద స్థిరంగా ఉండటంలో పామాయిల్ ముందుంటుంది. ఇంట్లో రోజువారీ వంటలకు నూనెల్ని మారుస్తూ (రొటేషన్ పద్ధతి) వాడటం మంచిది. అలాగే ఏ నూనె అయినా సరే కేలరీలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, వాడే పరిమాణం తక్కువగా ఉండేలా చూసుకోవాలి.

## ఈ జంతువు పాలు

# తియ్యగా ఉంటాయి

ఈ ప్రపంచంలో ఎన్నో వందల జంతువులు ఉన్నాయి. ఒక్కో జంతువులో ఒక్కోటి ప్రత్యేకత ఉంటుంది. ఒక జంతువు తొందరగా తినడంలో స్పెషలిస్ట్ అయితే ఇంకో జంతువు ఇంకో దాంట్లో స్పెషలిస్ట్ అవుతుంది. అయితే కొన్ని జంతువులు



పాలు ఇస్తాయి. ఎక్కువగా ఆవు, మేక, గేదె ఇలా కొన్ని జంతువులు పాలు ఇస్తాయనే విషయం అందరికీ తెలిసిందే. సాధారణంగా పాలు అనేవి పెద్ద టేస్ట్ ఉండవు. ఉదాహరణకు ఆవు పాలు తీసుకుంటే.. వీటిని వేడి చేస్తేనే తియ్యగా మారుతాయి. అది తక్కువ సమయం కాదు. ఎక్కువ సమయం వేడి చేస్తే అవి దగ్గర అవుతాయి. అప్పుడు వాటికి తియ్యదనం వస్తుంది. ప్రతీ ఒక్కరూ కూడా ఇంట్లో పాలను (Milk) వాడుతుంటారు. టీ, కాఫీ, నెయ్యి, పెరుగు ఇలా ఏదో ఒకటి చేయడానికి వాడుతుంటారు. పాలతో టీ చేసిన కూడా ఇవి తీయగా ఉండకపోవడంతో వీటిలో షుగర్ వేస్తుంటారు. అయితే ఈ ప్రపంచంలో ఓ జంతువు పాలు మాత్రం చాలా తీయా ఉంటాయట. ప్రపంచంలోని అత్యంత తియ్యని పాలను ఇచ్చే జంతువు కూడా ఇదే. ఇంతకీ ఆ జంతువు ఏది? పూర్తి వివరాలు చూద్దాం.

ప్రపంచంలోనే అత్యంత తియ్యని పాలను ఇచ్చే జంతువు ఏనుగు. ఏనుగు పాలు చాలా తీయగా ఉంటాయి. వీటి తర్వాత సాహివాల్ ఆవులు తియ్యని పాలను ఇస్తాయి. ఈ ఆవులు ఎక్కువగా పంజాబ్, హర్యానా, ఢిల్లీ, బీహార్, మధ్యప్రదేశ్‌లలో ఉంటాయి. అయితే సాధారణంగా మద్యంలో ఆల్కహాల్ ఉంటుంది. కానీ ఏనుగు పాలలో ఎక్కువగా ఆల్కహాల్ శాతం ఉంటుంది. దాదాపుగా 60 శాతం ఈ పాలలో ఆల్కహాల్ ఉంటుంది. ఈ పాలు కొంచెం తాగితే మూర్ఛపోతారు. అలాగే ఏనుగు పాలలో కొవ్వు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఆవు పాలలో ఉండే ప్రోటీన్ కంటే ఏనుగు పాలలో 100 రెట్లు ఎక్కువ ప్రోటీన్ ఉంటుంది. ఏనుగు పిల్లలు రోజుకు 10 లీటర్ల పాలు తాగుతాయి. ఏనుగు పాలు మానవులకు పెద్దగా ఉపయోగపడవు.

ఏనుగు పాలలో ఎక్కువగా రసాయనాలు ఉంటాయి. ఇందులో బీటా కేసైన్‌తో పాటు అధిక స్థాయిలో లాక్టోస్ ఉంటుంది. ఏనుగు పాలలో కార్బోహైడ్రేట్ అధిక పరిమాణంలో ఉంటుంది. దీని వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్, విరేచనాలు వస్తాయి. సాధారణంగా ఒక ఏనుగుకు రోజుకు 150 కిలోల ఆహారం అనేది తప్పకుండా కావాలి. అందుకే రోజులో 12 నుంచి 18 గంటలు వరకు గడ్డి, పండ్లు, ఆకులు వంటివి ఏనుగులు తింటాయి. అయితే ఈ ప్రపంచంలో ప్రస్తుతం 3 రకాల ఏనుగులు మాత్రమే ఉన్నాయి. కానీ 5 మిలియన్ సంవత్సరాలకి ముందు భూమి పై దాదాపుగా 170 రకాల ఏనుగులు ఉండేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 08.09.2026
www.mudranews.in | @mudranews



## వైరల్ జ్వరాలు :



పరిశుభ్రత పాటించాలి వైరల్ ఇన్ఫెక్షన్లు ఇతరులకు వ్యాపించకుండా చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలి. దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు మాస్క్ లేదా టిష్యూ ఉపయోగిస్తూ, వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోకుండా జాగ్రత్త పడాలి.

# రైతు సమస్యలపై సారంపల్లి పోరాటం చిరస్మరణీయం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ముద్ర, హైదరాబాద్:** రైతుల కోసం జీవితాన్ని ధారపోసిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో జరిగిన సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం.. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతం నుంచి జాతీయ స్థాయి వరకు ఎదిగి రైతుల సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడు సారంపల్లి అని కొనియాడారు. కౌలు రైతుల సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధర కోసం ఆయన చేసిన పోరాటం మరువ లేనిదన్నారు. భూమి సారం నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు ఎదుర్కొనే సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి సారంపల్లి అని పేర్కొన్నారు.ఆయన రాసిన పుస్తకాలు, లేవనెత్తిన అంశాలను దృష్టిలో పెట్టుకుని రైతాంగ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిపై తనకు వ్యక్తిగతంగా ఎంతో అభిమానం ఉందన్నారు. కమ్యూనిస్టులు పేదలు, రైతు లు, కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాలను ప్రస్తావిస్తూ కనీస వేతన చట్టం, ఉపాధి హామీ చట్టం, ఆహార భద్రత చట్టం వంటి చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దున్నేవాడికి భూమి కోసం కమ్యూనిస్టులు పోరాడితే.. అసైన్డ్ భూముల పంపిణీ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపిందని పేర్కొన్నారు.

**మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు**

దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కమ్యూనిస్టులు, ప్రజాస్వామ్య వాదులు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు.ఎన్నికల్లో గెలవలేని పరిస్థితుల్లో కొత్త విధానాలను ఉపయోగించుకుంటున్నారని ఆరోపించిన సీఎం.. ఎన్నికల కమిషన్‌ను కూడా రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారని విమర్శించారు. పేద ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. దేశానికి నరేంద్రమోదీ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని వ్యాఖ్యానిస్తూ.. మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అని అన్నారు.సారంపల్లి మల్లారెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్ సహచరులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా రాస్తారోకో





**ముద్ర, చేవెళ్ళ:** అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జరిగిన పరాభవం, మాజీ మంత్రి మహేశ్వరం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి పై అనుచితంగా ప్రవర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం మరియు పోలీసుల తీరును ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండల కేంద్రాలలో సోమవారం నిరసన చేశారు.శంకర్ పల్లి, చేవెళ్ల, షాబాద్ మండలాల్లో ప్రధానకూడలిలో రాస్తారోకో చేశారు. వాహనాలు నిలిచి పోయాయి. ముఖ్యమంతి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం లోని అని మండల కేంద్రాలలో కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు కృష్ణారెడ్డి, ప్రభాకర్, గోవర్ధన్ రెడ్డి,ఆంజనేయులు, విజయర్య అవినాష్ రెడ్డి, నర్సింగరావు, వాసుదేవ, మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, నర్సింలు, విజయభాస్కర్ రెడ్డి, నాయకులు శశిధర్ రెడ్డి, శ్రీధర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల హామీలను అమలు చేయాలి**

ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను తుంగలో తొక్కిందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు.కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ అధిష్టానం ఇచ్చిన 7 రోజుల నిరసన పిలుపులో భాగంగా, ఆరో రోజు చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన నిర్వహించారు. చేవెళ్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాల యంలోని ప్రజావాణి కేంద్రంలో ఆర్డీవో కు హామీలు అమలు చేయాలంటూ వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను దగా చేసి గద్దెనెక్కిందని. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా నెరవేర్చలేక పోయారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు పెంపు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి ప్రధాన హామీలను గాలికి వదిలేసి ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలను నిలిపివేసి పేద, మధ్యతరగతి ప్రజల పొట్ట కొడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ దేశమల్ల ఆంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్స్ దూత మల్లేష్, డప్పు సువర్ణ చందు, కురువ మంగమ్మ మల్లేష్, దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, బ్యాగరి సుదర్శన్, ఎన్.కృష్ణారెడ్డి, డి.సత్యం, యు.రాం ప్రసాద్, బ్యాగరి అనిల్, కడ మంచీ ఆనంద్, టి. యాదయ్య, ఎండి. జహీద్, సర్పంచ్ మల్లరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామ గౌడ్, ఊరెళ్ళ మాజీ సర్పంచి నర్సింలు, సిహెచ్. కృష్ణ, బి.నర్సింలు,మాజీ సర్పంచ్ శివారెడ్డి, రఘురెడ్డి, మాధవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**హెచ్ బిలో సీఎం దిష్టిబొమ్మ దహనం**

**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనల మేరకు కేపీహెచ్‌బీ డివిజన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, బాలాజీ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పగడాలు శిరీష బాబురావు నేతృత్వంలో ఈ ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వసంత్ నగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆస్తులను '22-ఏ' జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడే భూములను వేల కోట్ల రూపాయలకు విక్రయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై విరుచుకుపడ్డారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, సంక్షేమ పథకాలను రద్దు చేసి అన్ని రంగాలను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల విఫలానికి నిరసనగా 420 అడుగుల ఫ్లెక్సీతో కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్ నుండి మూడో ఫేజ్ జయశంకర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజల జీవనోపాధికి గండి కొడుతున్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



### జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి:** ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖ 27, ఇతర శాఖలకు సంబంధించిన 29, మొత్తం 56 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.

**మట్టి గణపతి పోస్టర్ విడుదల**

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని సూచించారు. సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కలెక్టర్ కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ. 1.11 కోట్ల విరాళం



**ముద్ర, హైదరాబాద్:** బంజారాహిల్స్‌కు చెందిన కుంచాల మధురాం రెడ్డి విరాళం తిరుమల : టిటిడి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన ప్రముఖ దాత శ్రీ కుంచాల మధురాం రెడ్డి రూ.1.11 కోట్ల భారీ విరాళాన్ని అందించారు. సోమవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ శ్రీ బి.ఆర్. నాయుడును కలిసి దాత ఈ విరాళాన్ని అందజేశారు. గోసంరక్షణ, గోసేవకు పెద్దపీట వేస్తున్న టీటీడీకి అండగా నిలిచి, భారీ విరాళం అందించిన దాత కుంచాల మధురాం రెడ్డిని చైర్మన్ బి.ఆర్. నాయుడు అభినందించారు. గోవుల సంరక్షణకు దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని, భక్తులు, దాతల సహకారంతో టీటీడీ గోసంరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తుందని తెలిపారు.

## అంబు రామేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** . పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామ శివారులో ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీ అంబురామేశ్వర స్వామిని స్థానిక పార్టీ నేతలతో కలిసి దర్శించుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే తో పాటు తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, డిసిసి చైర్మన్ దారాసింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మైపాల్ రెడ్డి, స్థానిక పార్టీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు

## ప్రముఖ యూట్యూబర్ నందుస్ వరల్డ్ అరెస్ట్



**ముద్ర, హైదరాబాద్:** ప్రముఖ యూట్యూబర్ నందుస్ వరల్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, స్పాన్సర్‌షిప్‌లు ఇప్పిస్తామని పలువురి నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఆమెపై పలు కేసులు నమోదైనట్లు తెలుస్తోంది.ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ కావడంతో విదేశాల నుంచి తిరిగి వచ్చిన సమయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## యువత స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



**ముద్ర, చేవెళ్ళ :** యువత స్వయం ఉపాధి తో ఆర్థిక అభివృద్ధి సాధించాలని శంకర్ పల్లి పురపాలిక చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన పురపాలక పరిధిలో ని సంగారెడ్డి రోడ్డులో యువకుడు శివకుమార్ నూతనంగా ఏర్పాటు చేసుకున్న వినాయక మెడికల్ దుకాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు కున్న యువత కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. తాను ఉపాధి పొందడంతో పాటు పది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. శంకర్ పల్లి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పురపాలిక కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చంద్రమౌళి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రాఘువేందర్, రాజేందర్, మహేందర్, జైపాల్ రెడ్డి, శ్రీశైలం, సుధాకర్, , జంగిలయ్య, విజయ్, శేఖర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు



**ముద్ర, చేవెళ్ల:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందచేయడం జరుగుతుందని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి భీమ్ భరత్ అన్నారు. సోమవారం ఆయన మొయినాబాద్ లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చేవెళ్ళ శంకర్ పల్లి, నవాబ్ పేట్ , మొయినాబాద్, షాబాద్ మండలాల కు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయం పేదలకు వరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరి సతీష్ మొయినాబాద్ మండలం మాజీ అధ్యక్షులు మాణయ్య, మండల అధ్యక్షులు సత్య నారాయణ, వైస్ ప్రెసిడెంట్ మర్రి రవీందర్ రెడ్డి, డైరెక్టర్ బాల కృష్ణ రెడ్డి, గణేష్ గౌడ్ , వెంకట్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , కౌన్సిలర్ పైముదా సమీ యుద్దీన్ శంకర్ పల్లి మండల సేవా దళ ప్రెసిడెంట్ నసీరుద్దీన్ , సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి , ఇంద్ర రెడ్డి కొమర బండ సుభాష్ చంద్రబోస్ , చైర్మన్ వెంకటయ్య, , శంకర్ గౌడ్ , ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్ , బాకరం మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి , విఠల్ యాదవ్ , వెంకట్ రెడ్డి , మాజీ అధ్యక్షులు వెంకటయ్య , పోలీస్ మధుసూదన్ రెడ్డి ప్రసాద్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుడు వడ్డేపల్లి హౌస్ అరెస్టు



**ముద్ర, కూకట్‌పల్లి :** రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన "ఫీజుల బకాయి – బీజేపీ లడాయి" అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. నియోజకవర్గ కార్యకర్తలతో కలిసి అసెంబ్లీకి బయలుదేరిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును కూకట్‌పల్లి పోలీసులు సోమవారం హౌస్ అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తుంటే హౌస్ అరెస్టులు చేయడం, నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులకు భయపడేది లేదని, విద్యార్థులకు పూర్తిగా న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## వ్యాపారులు, ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు




**ముద్ర, కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యాపార సంస్థలు, ప్రజలనుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కేపీహెచ్‌బీ పోలీసులు స్పష్టం చేశారు. ఏసీపీ ఆదేశాల మేరకు కేపీహెచ్‌బీ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు స్పష్టమైన సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు.ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం: నూతనంగా ప్రారంభించే షాపులు, వ్యాపార సంస్థల వద్ద యజమానులు, సిబ్బంది లేదా ప్రజలను డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం, బెదిరించడం లేదా ఇబ్బంది పెట్టడం వంటి చర్యలకు పాల్పడకూడదు.రాత్రి వేళల్లో ప్రధాన రహదారులు, షాపుల వద్ద ప్రజలను అడ్డుకోవడం, వారి పట్ల దురుసుగా ప్రవర్తించడం లేదా ఇబ్బంది కలిగించేలా డబ్బులు వసూలు చేయడం పూర్తిగా నేరం.ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతియుతంగా ప్రవర్తించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సూచించారు.ఈ సూచనలను ఉల్లంఘించి బలవంతంగా డబ్బులు వసూలు చేసినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిజాయితీకి నిదర్శనం..

## రూ.3 లక్షలు తిరిగిచ్చిన ఆర్టీసీ సిబ్బంది

**ముద్ర, షాద్‌నగర్:** బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన రూ.3 లక్షల నగదును భద్రంగా తిరిగి అప్పగించి ఆర్టీసీ కండక్టర్ సరిత, డ్రైవర్ నరసింహులు నిజాయితీ చాటుకున్నారు.షాద్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త జహంగీర్ తన భార్యతో కలిసి హజ్ యాత్రకు వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటూ శనివారం హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరారు. అఫ్జల్‌గంజ్‌లో బస్సు దిగిన అనంతరం నాంపల్లికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత రూ.3 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను బస్సులోనే మరిచిపోయినట్లు గుర్తించి ఆందోళనకు గురయ్యారు.అదే సమయంలో బస్సులో బ్యాగ్‌ను గమనించిన కండక్టర్ సరిత వెంటనే డ్రైవర్ నరసింహులుకు సమాచారం అందించారు. ఇద్దరూ నగదు బ్యాగ్‌ను భద్రపరిచి, ప్రయాణికుడు తిరిగి వస్తాడని వేచి చూశారు. కొద్దిసేపటికే బస్టాండ్‌కు చేరుకున్న జహంగీర్‌కు రూ.3 లక్షల నగదును పూర్తిగా తిరిగి అప్పగించారు.కండక్టర్ సరిత, డ్రైవర్ నరసింహుల నిజాయితీ, అంకితభావాన్ని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఆర్టీసీ సిబ్బంది బాధ్యతాయుత ప్రవర్తనకు ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 8.09.2026
www.mudranews.in | @mudranews



**వైరల్ జ్వరాలు : లక్షణాలు తీవ్రంగా ఉంటే వైద్యులను సంప్రదించాలి**

జ్వరం తగ్గకుండా కొనసాగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన నీరసం, నిరంతర వాంతులు, గందరగోళం లేదా ఇతర తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.



## జర్నలిస్టుల అరెస్ట్ అప్రజాస్వామికం

**- బేషరతుగా విడుదల చేయాలి - APUWJ డిమాండ్**

**ముద్ర, అమరావతి** : నంద్యాలలో ఐ న్యూస్ రిపోర్టర్స్ అరెస్ట్ అప్రజాస్వామికం, వారిని బేషరతుగా విడుదల చేయాలి అని ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (APUWJ) రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కే జయరాజు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈ. ఎన్.రాజు డిమాండ్ చేశారు . నంద్యాల లో జరుగుతున్న విషయాలు ఐ న్యూస్ రిపోర్టర్స్ వెలుగులోకి తీసుకువచ్చిన అంశాలలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఖండన ఇవ్వొచ్చని, లేదా పరువునష్టం కలిగించే అంశాలు ఏమైనా ఉంటే పరువునష్టం దావా కూడా వేయొచ్చన్నారు. అలా కాకుండా కేసులు పెట్టి అర్ధరాత్రి అదుపులోకి తీసుకొని ఇప్పటి వరకు అరెస్ట్ చూపించక పోవడం దారుణమని అన్నారు. అధికార పార్టీ నేతల అండతోనే అక్రమ కేసులు, అరెస్ట్ లు చేశారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, డీజీపీ వెంటనే స్పందించి అరెస్ట్ చేసిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని, జర్నలిస్టుల పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సోమవారం ఒక ప్రకటనలో వారు హెచ్చరించారు.

## కార్యకర్త బలంగా ఉంటే పార్టీ బలంగా ఉంటుంది

**చంద్రబాబు**

**ముద్ర, అమరావతి:** కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో కార్యకర్తల సంక్షేమం, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, భవిష్యత్‌లో ఆర్థికంగా ఎదిగే అవకాశాలపై ఆయన చర్చించారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. కార్యకర్తలు విస్మయానికి గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. టీడీపీ కార్యకర్త హుషారుగా పనిచేస్తే గెలుపును ఆపడం అసాధ్యమని వ్యాఖ్యానించారు. కార్యకర్తల్లో చాలామంది పేదవారు ఉన్నారని, వారికి పార్టీ ద్వారా తగిన ఫలితాలు దక్కేలా చూడాలని సూచించారు.జిల్లాలు, నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు మంత్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. సమస్యలు పరిష్కారం కాకుంటే సంబంధిత మంత్రులే జవాబుదారీగా ఉంటారని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర్థంగా పనిచేసిన కార్యకర్తలకు స్థానిక పరిస్థితులను బేరీజు వేసుకుని టిక్కెట్లు కేటాయిస్తామని తెలిపారు. కార్యకర్తలు కేవలం రాజకీయంగానే కాకుండా ఆర్థికంగా కూడా అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సహించాలని సూచించారు. వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలపై వారికి మార్గదర్శకత్వం అందించాలని చెప్పారు. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## హుజూరాబాద్ - సుందరగిరి మధ్యన హై లెవెల్ వంతెన

**- రూ.6.60 కోట్లు మంజూరు**



**ముద్ర, చిగురుమామిడి** : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలో హై లెవెల్ వంతెన నిర్మాణం కోసం రూ. 6.60 కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ వంతెన నిర్మాణంతో హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు. తాను ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నిధుల మంజూరుకు కృషి చేసి ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుతున్నట్లు మంత్రి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సహకారంతో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తూ ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. నిధులు మంజూరు చేసిన రేవంత్ రెడ్డి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంతోకాలంగా ప్రజల చిరకాల వాంఛగా మిగిలిపోయిన ఈ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**ముద్ర, వేములవాడ:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డిప్యూటీ ఈవో నవీన్ కుమార్, ఆలయ అధికారులు పర్యవేక్షించారు. సుమారు 80 వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## మా పాఠశాల మాకు కావాలంటూ విద్యార్థుల పాదయాత్ర

**ముద్ర, కరీంనగర్** : మా ప్రభుత్వ పాఠశాల మాకు కావాలని కోరుతూ కొందరు విద్యార్థులు కరీంనగర్ జిల్లాకు బయలుదేరారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం గన్ముకుల గ్రామంలో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల ఉండగా కేవలం 16 మంది మాత్రమే చదువుతున్నారు. ఈ పాఠశాలను నాలుగు కిలోమీటర్ల దూరంలో అన్న మరో ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తరలించేందుకు సిద్ధం కాగా పాఠశాలలో తరలించవద్దంటూ అక్కడి విద్యార్థులు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌కు వచ్చారు. పాఠశాలను తరలించవద్దంటూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.



# ఎమ్మెల్యేల అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్..

## కరీంనగర్‌లో భారీ రాస్తారోకో!



**ముద్ర, కరీంనగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా సబ్బండ వర్గాలను మోసం చేసిందని, ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఆందోళనలు ఉధృతమయ్యాయి. ప్రజా సమస్యలపై నిలదీసేందుకు అసెంబ్లీ సమావేశాలకు నల్ల చొక్కాలు ధరించి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని, అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్‌లో గులాబీ శ్రేణులు కదం తొక్కాయి.

కరీంనగర్ బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరి శంకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ఆందోళన కారణంగా ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

**వెయ్యి రోజుల పాలనలో సర్వనాశనమైన వ్యవస్థలు**

ఈ సందర్భంగా నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు, పేదలకు ఆసరా పెన్షన్లు సక్రమంగా అందడం లేదని విమర్శించారు. రైతన్నలకు రైతుబంధు, రైతు బీమా కరవయ్యాయని, జీవిత కాలం సేవ చేసి రిటైర్ అయిన ఉద్యోగులకు కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తారనే భయంతోనే నల్ల చొక్కాలతో వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చేతకాని పాలనకు పరాకాష్ఠ అని విమర్శించారు.

**తక్షణమే ఎమ్మెల్యేలను విడుదల చేయాలని డిమాండ్**

అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, వారిని అసెంబ్లీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై గళం విప్పితే అణచివేయాలని చూస్తే ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు గారు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణ రావు గారు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ గారు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్న అనిల్ కుమార్ గారు, బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జిలు డివిజన్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రాస్తారోకలో పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన తెలిపారు.

## ఉద్యోగాల పేరిట మోసం.. ఎమ్మెల్యే పీఏ అరెస్ట్

**ముద్ర, భద్రాచలం:** ఉద్యోగాల పేరిట మోసం చేసిన భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కల్యాణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం వాసి రాయల శ్రీను ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. నిరుద్యోగుల నుంచి సుమారు రూ.8కోట్లు వసూలు చేసినట్లు కల్యాణ్‌పై ఆరోపణలు ఉన్నాయి. 54 మంది ని ఆయన మోసం చేసినట్లు సమాచారం. బెట్టింగులకు అలవాటుపడి కల్యాణ్ డబ్బు పోగొట్టుకున్నట్లు సమాచారం.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసన

**ముద్ర, కరీంనగర్ :** రేవంత్ రెడ్డి ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న పథకాలు, హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. కరీంనగర్ పట్టణం , జిల్లాలో ప్రజలకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## స్పీకర్‌పై ఘోరమైన భాష.. కేసీఆర్ స్పందించాలి

**- మంత్రి శ్రీధర్‌బాబు**



**ముద్ర, హైదరాబాద్ :** స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదన్నారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఉందన్నారు. కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయన్నారు. పార్టీ నేతలతో కలిసి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు.

**పోలీసులపై కేటీఆర్ చేయిచేసుకున్నట్లు కనబడుతోంది..**

"సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారు. ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తి కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడం మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయిచేసుకున్నట్లు కనబడుతోంది. పోలీసు సిబ్బంది గొంతు నొక్కుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలి. బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉంది. అసెంబ్లీలోకి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించింది. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదనే నిబంధన ఉంది.

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక న్యాయం, మాకో న్యాయమా అని కేటీఆర్ అంటున్నారు. రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకుని లోక్‌సభకు వెళ్లలేదు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్ సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయి. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే మేము తీసుకెళ్లలేదు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారు. ఏవైనా లోటుపాట్లు జరిగితే మా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది.

**ఆ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు**

తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలి. ఆయన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదు. స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం?. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంది. తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారు. శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారు. మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపింది. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. ఆ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందే. ఆ తర్వాతే మిగతా కార్యకలాపాలు ఉంటాయి. అసెంబ్లీ ప్రాంగణానికి సంబంధించి పూర్తిస్థాయి అధికారం స్పీకర్, ఛైర్మన్‌కే ఉంటుంది'' అని శ్రీధర్‌బాబు అన్నారు.

## లోయలోకి లారీ దూసుకెళ్లడంతో మంటలు

**ఇద్దరు సజీవ దహనం?**



**ముద్ర, కడప న్యూస్** : వైఎస్ఆర్ కడప జిల్లా గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ.. ప్రహరీని ఢీకొని లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంతో లారీలో భారీగా మంటలు చెలరేగాయి. అందులోని డ్రైవర్, క్లీనర్ సజీవ దహనమైనట్లు సమాచారం. అటవీ ప్రాంతం కావడంతో మంటలు చుట్టుపక్కలకు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బిఆర్ఎస్ ధ్వజం

*** ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజావాణిలో ఫిర్యాదు....**
*** కేటీఆర్,హరీష్ రావుల అరెస్టుకు నిరసనగా చిగురుమామిడిలో భారీ ధర్నా...**

**ముద్ర చిగురుమామిడి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420అబద్ధపు హామీలను విస్మరించిందని,రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలను బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల కేంద్రంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.హుస్నాబాద్ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే ఓడితల సతీష్ కుమార్ ఆదేశాల మేరకు,చిగురుమామిడి మండల కేంద్రంలో మామిడి అంజయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా బిఆర్ఎస్ నాయకులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి హామీలను గుర్తు చేస్తూ రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు.ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా నాయకులు తీవ్రంగా ఎండగట్టారు.అనంతరం మండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అక్రమంగా అరెస్టు చేసిన కేటీఆర్, హరీష్ రావులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన,ధర్నా కార్యక్రమంలో మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు,మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సర్వర్ భాష,గ్రామ శాఖ అధ్యక్షులు కత్తుల రమేష్, బుర్ర తిరుపతి, సన్నీల్ల మల్లేశం, మాజీ ఎంపిటిసి మిట్టపల్లి మల్లేశం, మాజీ కోఆప్షన్ సభ్యులు మక్బూల్ పాషా,మాజీసర్పంచ్‌లు బెజ్జంకి లక్ష్మణ్, బోయిని శ్రీనివాస్, మాజీఉపసర్పంచ్ మల్లికార్జున్ రెడ్డి,మహంకాళి కొమురయ్య, కాశబోయిన రాజు యాదవ్, చెరుకు సంజీవ్,పెనుకుల సురేష్, రమేష్, ఉమామహేశ్వర్ రెడ్డి, నిలిగొండ దశరథం, కాశరాజు ఆంజనేయులుతో పాటు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 08.09.2026
www.mudranews.in | @mudranews



**వైరల్ జ్వరాలు :** తగినంత విశ్రాంతి వైరల్ జ్వరం వచ్చినప్పుడు శరీరానికి విశ్రాంతి చాలా అవసరం. ఎక్కువగా శ్రమ చేయకుండా తగినంత నిద్ర, విశ్రాంతి తీసుకోవడం ద్వారా కోలుకునే ప్రక్రియకు సహకరిస్తుంది.



# ఖనిజాల లీజుల ద్వారా రెవెన్యూ ఆదాయం





## కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశం

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఖనిజాల లీజుల ద్వారా రెవెన్యూ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ నగేష్, రెవిన్యూ, మైనింగ్, భూముల కొలతల శాఖ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ సున్నపురాయి, మాంగనీస్, ఇనుప ఖనిజం, లిథియం మొదలైన ఖనిజాలతో సహా ప్రధాన ఖనిజాల లీజులను కేవలం వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని ఆదేశిస్తూ భారత ప్రభుత్వం 2015లో ఎంఎండిఆర్ చట్టాన్ని సవరించింది. దీనికి అనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా జి.ఓ.ఎం.ఎస్.నెం.26, తేది.31.03.2022 ద్వారా, ముడి రాయి, రోడ్డు మెటల్, భవన నిర్మాణ రాయి, డోలమైట్ మొదలైన చిన్న ఖనిజాల క్వారీ లీజులను వేలం ఆధారంగా మంజూరు చేయడాన్ని తప్పనిసరి చేస్తూ తెలంగాణ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్, 1966ను సవరించిందని వివరించారు. ప్రధాన ఖనిజాల లీజుల కేటాయింపును మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం కేవలం ఈ-వేలం ఈ - ఆక్షన్ ద్వారా మాత్రమే కేటాయించాలని స్పష్టం చేసిందని వివరించారు.ఏడి మైన్స్ నాగరాజు, ఏడి ల్యాండ్ సర్వే కిషన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ రంజిత్ కుమార్, ఆర్డీవోలు, తహసిలార్దులు తదితరులు పాల్గొన్నారు.ఈవీఎం గోదామును తనిఖీ కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణను పర్యవేక్షించారు.ఈ తనిఖీలో ఎన్నికల సూపరెండెంట్ గఫర్, విభాగ అధికారులు, సంబంధిత సిబ్బంది, పాల్గొన్నారు. సత్వరమే ప్రజావాణి దరఖాస్తుల పరిశీలించాలిసత్వరమే ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ సమావేశమందిరంలో ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం సీఎం ప్రజావాణి, జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించారు.

# మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు ఫిర్యాదు చేయాలి

### మొబైల్ ఫోన్ల రికవరీ చేసి యజమానులకు అందజేసిన ఎస్పీ అక్షాన్ష్ యాదవ్





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రతి ఒక్కరూ వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, మొబైల్‌కు సంబంధించిన ఐ ఎం ఈ ఐ నంబర్ వివరాలను అందించాలని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. సోమవారం ఐ ఎం ఈ ఐ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న, చోరీకి గురైన 100 మొబైల్ ఫోన్లను, సుమారు రూ.20 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను వివిధ రాష్ట్రాల నుండి విజయవంతంగా రికవరీ చేశారు.పౌరులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న లేదా చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే, ఆయా పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సి ఈ ఐ ఆర్ వారియర్ అధికారులు ఫిర్యాదుదారుల వివరాలను సి ఈ ఐ ఆర్ పోర్టల్‌లో నమోదు చేసి, సంబంధిత మొబైల్ ఫోన్ల ఐ ఎం ఈ ఐ నంబర్ల ఆధారంగా నిరంతరం ట్రాకింగ్ చేపట్టి ఫలితంగా శంసుంగ్, వన్ ప్లస్, వీవో, ఒప్పో తదితర వివిధ ప్రముఖ బ్రాండ్లకు చెందిన 100 మొబైల్ ఫోన్లను తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి రికవరీ చేసిన్నట్లు చెప్పారు.రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ కార్యాలయంలో వాటి అసలైన యజమానులకు స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, సి సి ఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ బాబు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ విద్యార్థికి రూ.10 వేల సాయం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మెదక్ ప్రభుత్వ డిగ్రీ విద్యార్థిని అంజలి ఎంపికైంది. పోటీలకు వెళ్ళడానికి ప్రయాణఖర్చులు, ఇతర ఖర్చుల నిమిత్తం మెదక్ పట్టణానికి చెందిన వ్యాపారి గంజి శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. పాండిచ్చేరిలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అంజలి పాల్గొననుంది. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ పట్టుదలతో చదువును కొనసాగిస్తూ క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తోంది. తల్లిదండ్రులు లేకపోయినా తన లక్ష్యాన్ని వీడకుండా అంజలి ముందుకు సాగుతోంది.

# అటవీ అధికారుల వేధింపులు తాళలేక రైతు ఆత్మహత్య

**ముద్ర ప్రతినిధి, మెదక్:** అటవీ శాఖ అధికారి వేధింపులు తాళలేక మనస్తాపంతో రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ మండలం పాతూర్ లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బుస్సా పొచ్చయ్య (55) ఇంట్లో శ్రీమంతం వుందని వంట చెరుకు అడవి వెళ్ళాడు. పొచయ్య వెంబడి కుక్క రావడంతో అడవిలో ఉడుము పిల్లను కుక్క పసిగట్టింది. ఈ విషయంలో ఫారెస్ట్ అధికారికి తెలియడంతో మూడు రోజులు పాటు తండ్రి కొడుకులను చితకబాది హింసించారంటూ ఆరోపించారు. ఈనెల



4న అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. పోచయ్యను ఫారెస్ట్ ఆఫీసర్లు ఫారెస్ట్ ఆఫీస్ కు రమ్మనడంతో మళ్లీ దెబ్బలు కొడతారని భయంతో రాత్రి ఉరేసుకొని పోచయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు.పోచయ్య మరణాన్ని కారకులైన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లను సస్పెండ్ చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. మెదక్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తురున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

# స్పీకర్‌ను అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ కాకునూరి మహేందర్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, పిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు, ఆ పార్టీ నాయకులు మొదటి నుండి దళితులను అవమానపరుస్తూ వస్తున్న వైఖరిని నిరూపిస్తూ సోమవారం శాసనసభ సాక్షిగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని ఎమ్మెల్సీ తాతా మధుగారు అసభ్య పదజాలంతో చెప్పరాని మాటలతో దూషించడం ఎవత్ ప్రజాస్వామ్యవాదులందరూ ఖండిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జాంగిర్, నాయకులు షేక్ మజార్ పాషా బాబులు, లయిక్ అహ్మద్, పడిగెల ప్రదీప్, అంగడి నాగరాజు, పోకల యాదగిరి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోల్లపల్లి అశోక్, పిట్టల బాలరాజ్, డాకూరి ప్రకాష్, గుమ్మిడి రమేష్, రఫీఉద్దీన్ గౌరే, దేవరకొండ మహేష్, జంపాల నాగచందర్, ఆటో జాంగిర్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేల అరెస్టులకు నిరసనగా బీఆర్ఎస్ రాస్తారోకో

### ప్రజాస్వామ్యంపై దాడిని సహించేది లేదు

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజల తరపున అసెంబ్లీలో ప్రశ్నించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మెదక్‌లో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బైఠాయించి భారీ రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పద్మ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడం, వాటి అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షం బాధ్యత అని అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితర బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి తెలంగాణ భవన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కూడా అడ్డుకున్న తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం లేకుండా వ్యవహరించడం



ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజలకు మిగిలిందేమిటి?ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు పూర్తయినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా పద్మ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బిఆర్ఎస్ ఇంచార్జి కంఠరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బట్టి



జగపతి అకిరెడ్డి కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ మామిల్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు, ఆటో డ్రైవర్లు భారీ ఆటో, బైక్ ర్యాలీ నిర్వహించారు. మెదక్ వ్యవసాయ మార్కెట్ కమాన్ నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

# సబ్ కలెక్టర్‌గా కరోలిన్ చింగ్ తియాన్ మావి



**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ నూతన సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ హోదా గల కరోలిన్ చింగ్ తియాన్ మావి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాత్రికేయులు, వివిధ వర్గాల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఆమె సమర్ధవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

# అంకిత భావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు



**ముద్ర, దేవరకొండ:** వృత్తిలో అంకితభావంతో విధులు నిర్వహిస్తే వారికి తప్పకుండా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కొండమల్లేపల్లి ,పీఏ పల్లి ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు ఊరే జనార్ధన్ ,విడియాల రామయ్య తెలిపారు . సోమవారం కొండమల్లేపల్లి , పీఏ పల్లి, గుడిపల్లి మండలాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు వనవాసం వెళ్లారు. ఈ సందర్భంగా మహిళలు యువతులు చిన్నారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ సందడి చేశారు . అనంతరం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కొండ మల్లేపల్లి కి చెందిన శ్రీ క్రాంతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుండిగల్ అశోకు గారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొండమల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరే జనార్ధన్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, ఉమ్మడి పీఏ పల్లి మండల అధ్యక్షుడు విడియాల రామయ్య, సముద్రాల ధనయ, దాచేపల్లి నరేందర్ , సముద్రాల శ్రీను గుడిపల్లి ఎంఈఓ సముద్రాల శ్రీనివాస్, రాచమల్ల నరసింహ, తోట నరసింహ , జిన్నం రామ్మూర్తి , మిరియాల శ్రీనివాస్ కామ్ శెట్టి శ్రీనివాస్ ముచ్చర్ల కరుణాకర్ మారం వెంకన్న తేటిపల్లి బుచ్చి రాములు ,వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు సముద్రాల స్వప్న, వాస నీరజ ,దొడ్డు రమాదేవి పాల్గొన్నారు.

# ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

**ముద్ర, సూర్యాపేట:** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించేందుకు సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అర్జీలను తక్షణమే పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ప్రజలకు పోలీసులు మరింత చేరువ కావడం, వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, శాంతిభద్రతలను సమర్ధవంతంగా పరిరక్షించడమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ నరసింహ తెలిపారు.

# వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

### ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సూచన

**ముద్ర ప్రతినిధి, మెదక్:** గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ...ప్రతి గణేష్ మండపం వద్ద భద్రతా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీసులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని తెలిపారు.నిమజ్జనం, ఊరేగింపు మార్గాలను ముందుగానే పరిశీలించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా



ప్రత్యామ్నాయ మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సిద్ధం చేయాలని ఎస్పీ ఆదేశించారు. రద్దీ ప్రాంతాల్లో తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఊరేగింపుల్లో డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం సేవించి పాల్గొనడం వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ స్పష్టం చేశారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మెదక్ డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి,జార్జ్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. విచారణ పురోగతిని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555